ప్రజాశక్తి
సోమవారం 8 డిసెంబరు, 2025
5
శ్రీకాకుళం



తీరం... తీరని ఆనందాల తోరణం

పుక్కలపాలెం సముద్రతీరం కోలాహలంగా మారింది. ఆదివారం ఉదయం నుంచే పర్యాటకులకు ఆతిధ్యమిచ్చింది. అలసిన మనసులకు స్వాంతన కల్పిస్తూ ఉత్సాహాన్నిచ్చింది. చిన్నారులకు ఆటవిడిదయింది. యువకుల్లో ఉత్సాహాన్ని నింపింది. గజిబిజి జీవితాలతో తీరిక లేకుండా గడుపుతున్న వారికి కాసింత సేద తీర్చింది. మొత్తంగా ఈ ఆదివారాన్ని ఆహ్లాదకరంగా మార్చింది. - ప్రజాశక్తి, కవిటి




సేదతీరుతున్న పర్యాటకులు

'పది'కి ప్రణాళిక



పరీక్షకు సిద్ధమవుతున్న పదవ తరగతి విద్యార్థులు



- శతశాతం ఫలితాలే లక్ష్యం
- వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్న అధికారులు
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పదో తరగతి పరీక్షలు విద్యార్థి దశలో మొదటి మెట్టు. ఈ మెట్టు ఎక్కేందుకు విద్యార్థులు శ్రమిస్తారు. పాఠశాలల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటారు. పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శత శాతం ఫలితాలు సాధనకు విద్యాశాఖ ప్రత్యేక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి చేసి రివిజన్ ప్రారంభించారు. ఎ, బి, సి గ్రేడ్‌లు మెరుగైన పరిస్థితుల్లో ఉన్నవారు, మధ్య తరగతి విద్యార్థులు, స్లో లెర్నర్స్ ఇలా విభజించి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను పరీక్షల్లో గట్టెక్కించే ప్రయత్నం చేస్తున్నారు.

ఈనెల 6 నుంచి వంద రోజుల అమలు ప్రణాళిక ప్రారంభించారు. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి పది లోపు ఈ ప్రణాళిక కచ్చితంగా అమలు చేయనున్నారు. ప్రత్యేకంగా ప్రతి విద్యార్థీ ఆరు సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం మార్కులు సాధించేలా చదివించడం, ప్రశ్నపత్రాలు సాధన, ప్రధానంగా గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

జిల్లాలో 450 ప్రభుత్వ, 196 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలల నుంచి 28,000 మంది వరకు విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో తక్కువ ఫలితాలు వచ్చిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించారు. సమ్మేటివ్, హాఫ్ ఇయర్లీ వంటి పరీక్షలు మార్కులు ప్రామాణికంగా తీసుకొని విద్యార్థులపై వ్యక్తిగత ప్రగతికి శిక్షణ ఇస్తున్నారు.

వెనుకబడి విద్యార్థులపై రైజింగ్ స్టార్ పేరుతో వారిని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు రోజుకో సబ్జెక్టుపై వారానికి ఆరు సబ్జెక్టులపై రెమెడియల్ క్లాస్ వర్క్ నిర్వహిస్తున్నారు. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక తరగతి వర్క్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారు. రోజూ వంద రోజులు ప్రణాళికలో భాగంగా మధ్యాహ్నం 2.40 నుంచి సాయంత్రం 4 వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. నాలుగు నుంచి ఐదు మధ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల తప్పులు విశ్లేషించి, నైపుణ్యం పెంచుతున్నారు. వెనుకబడిన విద్యార్థులకు లోపాల తెలియజేయడం, ఒత్తిడి జయించేలా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇలా ప్రత్యేక ప్రణాళికతో విద్యాశాఖ ముందుకు సాగుతుంది.

గత ఫలితాలు...

విద్యా సంవత్సరం	ఉత్తీర్ణత శాతం
2021-22	78.22
2022-23	84.53
2023-24	93.35
2024-25	82.41



శతశాతం ఫలితాలు లక్ష్యం



జిల్లా యూనిట్‌గా శతశాతం ఫలితాలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. వెనుకబబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గతేడాది తక్కువ శాతం ఫలితాలు నమోదైన పాఠశాలలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. స్టడీ మెటీరియల్స్ విద్యార్థులకు అందజేస్తున్నాం. ప్రతి విద్యార్థీ ప్రతి సబ్జెక్టులో కనీసం 50 మార్కులు వచ్చేలా శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థి అంతర్గత మదింపు చేపడుతున్నాం.

- ఎ.రవిబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



వెనుకబడిన విద్యార్థులపై రైజింగ్ స్టార్స్‌గా పిలిచి ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ప్రతి విద్యార్థికీ కనీసం ప్రతి సబ్జెక్టులో 50 శాతం మార్కులు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. పరీక్షల్లో వారు చేస్తున్న తప్పులు గుర్తించి ఎస్సైన్‌మెంట్‌లు చేయిస్తున్నాం, ప్రాధాన్యత ఉన్న ప్రశ్నపత్రాలపై శిక్షణ ఇస్తున్నాం. సి గ్రేడ్ విద్యార్థులు లక్ష్యంగా తరగతులు నిర్వహిస్తున్నాం.

- బొడ్డేపల్లి క్రాంతికుమార్, ఉపాధ్యాయులు, కింతలి, హైస్కూల్, పొందూరు మండలం

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. స్టడీ అవర్స్‌లో వారికి ప్రతి సబ్జెక్టుపైనా శిక్షణ ఇస్తున్నాం. అంతర్గత పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించి పరీక్షకు సన్నద్ధం చేస్తున్నాం. పాఠశాల యూనిట్‌గా శతశాతం లక్ష్యంగా ఉపాధ్యాయులు కేర్ టేకర్లగా వ్యవహరిస్తున్నాం. తక్కువ మార్కులు వస్తున్న విద్యార్థులకు మానసికంగా సిద్ధంగా చేసేలా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. **- సీపాన నరసింహమూర్తి, ధర్మవరం, హైస్కూల్ ఉపాధ్యాయులు, ఎచ్చెర్ల మండలం**



మాట్లాడుతున్న తులసీదాస్

జిల్లాకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు జిల్లాకు ఇచ్చిన హామీలు ఎప్పటిలోగా అమలు చేస్తారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ ప్రశ్నించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సిపిఎం జిల్లా విస్తృత సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని, పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేసి చివర భూములకు నీరు ఇస్తామని, జీడికి గిట్టుబాటు ధర కల్పించి జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని, వంశధార నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఎప్పటికి నెరవేరుస్తారని ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం వల్ల ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయని అన్నారు. డబల్ ఇంజిన్ సర్కార్ అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం నేరేడు బ్యారేజీకి నోటిఫికేషన్ వేసి పనులు ఎందుకు ప్రారంభించడం లేదని కేంద్రమంత్రిని ప్రశ్నించారు. నేరేడు బ్యారేజీ పూర్తి చేసి చివరి భూములకు ఏడాదికి రెండు పంటలకు నీరు ఇస్తే జిల్లా సస్యమవుతుందని అన్నారు.

జిల్లాలో ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. జీడి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్రమైన దోపిడీ గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి గిట్టుబాటు ధర రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రభుత్వం సక్రమంగా చేపట్టకపోవడంతో రైతాంగం తీవ్ర దోపిడీకి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తాకు మూడు నుంచి ఐదు కేజీలు ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని, అయినా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. బస్తా ఒక్క ఇంటికి రైతులు వద్ద నుంచి రూ.20 చొప్పున మిల్లర్లు వసూలు చేయడం దోపిడీకి పరాకాష్ట అని అన్నారు. రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో అభివృద్ధి పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలని, ప్రభుత్వ నిర్బంధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శివర్గ సభ్యులు కోనారి మోహనరావు. బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేవీ డే

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం పట్టణంలోని ప్రైవేట్ రిసార్ట్‌లో ఆదివారం విశ్రాంత నేవే ఉద్యోగులు నేవీ డే వేడులకు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ నెల 4న ఇండియన్ నేవీ డే కాగా, జిల్లా నుంచి పలు ప్రాంతాలు నుంచి విశ్రాంత ఉద్యోగులు హాజరై సందడిగా నిర్వహించారు. జిల్లా మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పూర్ణచంద్రరావు, విశ్రాంత సీనియర్ అధికారులు నాగేశ్వరరావు, సతీష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు. కేక్ కోసి ఆనందంగా వేడులకు నిర్వహించారు. సీనియర్లు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సాహంగా నేవీ ఉద్యోగులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

టెట్ సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా

ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఉపాధ్యాయుల టెట్ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు తనకు తెలిసినా సమస్యల పరిష్కారం మన అందరి హయాంలోనే పరిష్కారమవుతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరుత్సాహం చెందాల్సిన పనిలేదని, దశలవారీగా సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని అన్నారు. అనంతరం యుటిఎఫ్ సంఘానికి రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే కోసమాలకు చెందిన టిడిపి ప్రధాన కార్యదర్శి బొచ్చు ప్రసాదరావు రూ.30 వేలు ఆర్థికసాయం యుటిఎఫ్ సంఘానికి అందించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ పోరాటంతోనే సమస్యల పరిష్కారం అవుతాయని అన్నారు. యుటిఎఫ్ కార్యదర్శులు గొంటి గిరిధర్, రవీందర్ మాట్లాడుతూ 2010 కంటే ముందు నియమితులై ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, ఎల్.వెంకటాచలం మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిషన్ పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు చాపర కూడలి నుంచి పాఠశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.దేవేందరావు, ఎం.పద్మనాభరావు యుటిఎఫ్ నాయకులు ఎన్.కుమారస్వామి, లక్ష్మీనారాయణ, అట్ల రవికుమార్, రామచంద్రరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమానికి భాగస్వామ్యమే కీలకం

బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యక్రమాల పూర్తి విజయానికి వారి భాగస్వామ్యమే కీలకమని బిసి సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బిసి కార్పొరేషన్ డైరెక్టర్లు, తరగతుల సంఘాల ప్రతినిధులతో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో విజయవంతమైన 'ఆదరణ 1, 2' కార్యక్రమాలకు కొనసాగింపుగా 'ఆదరణ 3' కార్యక్రమాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా తరగతి సంఘాల ప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలు, సూచనలు తీసుకొని గతంలో కంటే మెరుగైన విధానాన్ని రూపొందించాలని ఆదేశించారని తెలిపారు. దానికి అనుగుణంగానే జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తున్నామని సత్యనారాయణ వివరించారు. ఈ పథకంలో భాగంగా ఇప్పటివరకు 550 వృత్తిపరమైన పరికరాలను గుర్తించామన్నారు. వృత్తిపరంగా ఆధునిక పరికరాలను, నైపుణ్యాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. బిసి ప్రొటెక్షన్ యాక్టు ముసాయిదా తయారీ వెనుకబడిన తరగతుల రక్షణకు తయారవుతోందని వెల్లడించారు. సమావేశంలో పలు తరగతి సంఘాల ప్రతినిధులు తమ సమస్యలు, అభిప్రాయాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రజక కార్పొరేషన్ డైరెక్టర్ దుర్గారావు ఆధునిక ధోభీ ఘాట్‌ల నిర్మాణాన్ని కోరారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవులకు బంజరు భూములు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కమ్మరిలకు టార్పాలిన్లు సరఫరా చేయాలని, విశ్వబ్రాహ్మణులకు ఇంటి దగ్గర కలపకు కొంతవరకు అనుమతిస్తే అధికారుల వేధింపులు తగ్గుతాయని కోరారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్.వి.లక్ష్మణమూర్తి, జిల్లా బిసి సంక్షేమాధికారి అనురాధ, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డమ్మ, జిల్లా ప్రత్యేకాధికారి మారెళ్ల సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సత్యనారాయణ

దూసి రైల్వేస్టేషన్ అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని దూసి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులపై రైల్వే అధికారుల సమక్షంలో కన్సల్టేటివ్ కమిటీ ఆదివారం సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల సమస్యల పరిష్కారం, కొత్త సదుపాయాల ఏర్పాటుపై చర్చించారు. ముఖ్యంగా బొడ్డేపల్లి రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం బరంపూర్, పూరీ, తిరుపతి దూసి దూసి రైల్వే స్టేషన్‌లో నిలుపుదలకు అవకాశాలను చర్చించారు. అనంతరం రైల్వే అధికారులు కన్సల్టేటివ్ కమిటీ సభ్యులతో కలిసి స్టేషన్ పరిసరాలను పరిశీలి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు చింతాడ అప్పారావు, చిగిలిపల్లి రాజేష్, గురుగుబెల్లి రాజశేఖర్, సహ రైల్వే అధికారులు పాల్గొన్నారు.



చర్చిస్తున్న రైల్వే అధికారులు

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి నిర్వహించిన జాతీయ ఉపకార వేతన ప్రతిభ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మొత్తం 25 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 5,617 మంది విద్యార్థులకు గాను, 5,516 మంది హాజరు కాగా, 101 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని డిఇఒ ఎ.రవిబాబు తెలిపారు.

టెక్కలి : టెక్కలిలో ఆరు కేంద్రాల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్షలు నిర్వహించారు. ఆరు పరీక్ష కేంద్రాలను శ్రీకాకుళం డివిజన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి ఆర్. విజయలక్ష్మి పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పలాస : పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో 1668 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో 144, నారాయణ పాఠశాలలో 237, గురుకుల పాఠశాలలో 181, శ్రీచైతన్య పాఠశాలలో 232, భాష్యం పాఠశాలలో 210, కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో 238, పలాస ప్రభుత్వ పాఠశాలలో 236, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 190 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1696 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 98 శాతం 1668 మంది హాజరై పరీక్షలు రాసినట్టు తెలిపారు.



టెక్కలి : పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు

- డిజిటల్ యాప్‌ల ద్వారా నగదు చెల్లింపులు
- వ్యవసాయ, స్వయం సహాయక సంఘాలకు రుణాలు
- ఆర్థిక అక్షరాస్యతపై ప్రజల్లో అవగాహన
- ఎపి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎల్.అనంతరావు





ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎపి గ్రామీణ బ్యాంకు ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నట్లు జిల్లా రీజనల్ మేనేజర్ ఎల్.అనంతరావు అన్నారు. స్వయం సహాయ సంఘాలకు, రైతులకు బ్యాంకింగ్ సేవలు అందజేస్తున్నట్లు వివరించారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ మెరుగైన సేవలు అందజేస్తున్నామన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? బ్యాంకు సేవలు ఎలా ఉన్నాయి?

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 80 బ్యాంకు శాఖలు ఉన్నాయి. ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ మెరుగైన సేవలు అందజేస్తున్నాం. రైతులు, స్వయం సహాయ సంఘాలకు ఇబ్బంది లేకుండా రుణాలు అందజేస్తున్నాం. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎపిజివిబి, ఎపిజిబి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులను విలీనం చేసింది. ఎపి గ్రామీణ బ్యాంకుగా సేవలు అందజేస్తున్నాం.

? రైతులకు, స్వయం సహాయ సంఘాలకు ఎంత మేరకు రుణాలు అందజేశారు?

అర్హత బట్టి రైతులకు, స్వయం సహాయ సంఘాలకు రుణాల అందజేస్తున్నాం. గ్రామీణ ప్రాంత ప్రజల సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లాలో మా బ్యాంకు పరిధిలో 1,06,830 రైతులకు రూ.1907 కోట్లు రుణాలు అందజేశాం. స్వయం సహాయ సంఘాలకు రూ.2405 కోట్లు రుణాలు అందజేశాం. జాప్యం లేకుండా అర్హులకు అందజేస్తున్నాం.

? బ్యాంకు లావాదేవీలు ఎలా ఉన్నాయి?

80 శాఖల్లో రూ.6,200 కోట్లు లావాదేవీలు సాగుతున్నాయి. రూ.2800 కోట్లు డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. రూ.2,800 కోట్ల వరకు రుణాలు అందజేశాం. రూ.444 రోజుల ఫిక్షుడ్ డిపాజిట్ పథకం నిర్వహిస్తున్నాం. 7.95 శాతం వడ్డీ ఇస్తుంది. అనేక రకాల టర్మ్ డిపాజిట్లు, ప్రభుత్వ పథకాలకు రుణాలు అందజేస్తుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందజేస్తున్నాం.

? ఇతర సేవలు పరిస్థితి ఏమిటి?

వాహన కొనుగోలు, గృహ నిర్మాణాలు కొనుగోలు, రుణాలు అందజేస్తున్నాం. ఎస్ఎస్‌జి, కెసిసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు, వ్యాపార యూనిట్లకు, పరిశ్రమల ఏర్పాటు నిబంధనల మేరకు రుణాలు అందజేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనలు మేరకు అర్హులకు ఎటు వంటి హామీలు లేకుండా సైతం రుణాలు అందజేస్తున్నాం.

? ప్రజల్లో బ్యాంకులపై అవగాహన ఎలా ఉంది?

ఆర్థిక అక్షరాస్యత, సేవింగ్ అకౌంట్, ఇతర అకౌంట్లపై అవగాహన పెరిగింది. ప్రతిఒక్కరూ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఖాతాలు సైతం ఇబ్బంది లేకుండా అందజేస్తున్నాం. డిజిటల్ యాప్‌ల ద్వారా నగదు చెల్లింపులు ప్రోత్సహిస్తున్నాం. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం ప్రజల్లో బ్యాంకు సేవలపై పూర్తిస్థాయి అవగాహన ఉంది. రిజర్వ్ బ్యాంకు ఆదేశాలు మేరకు లైవ్‌లో లేని ఖాతాలు సైతం అమల్లోకి తెస్తున్నాం.



శ్రీకాకుళం సిటీ : పరీక్ష పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ఎర్రన్న నవోదయ మోడల్ పరీక్షకు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎర్రన్న విద్యా సంకల్పం పేరుతో జిల్లాలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా నవోదయ పాఠశాల నమూనా పరీక్ష జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు 917 మంది హాజరయ్యారు. 1129 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రధాన పరీక్ష తరహాలోనే ఉదయం 11 గంటలకు ప్రారంభమై పరీక్ష మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించారు. సోంపేట, పలాస, టెక్కలి, శ్రీకాకుళం, పాతపట్నం ప్రాంతాల్లో నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యవేక్షించారు.

పలాస : పలాస మదర్ థెరిస్సా పాఠశాలలో ఎర్రన్న విద్యా సంకల్పం ఆధ్వర్యాన ఆదివారం నవోదయ విద్యార్థులకు మాక్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు 51 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలను ఏపి ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు పరిశీలించారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మెరిసిన ఆర్‌కె విద్యార్థులు

ప్రజాశక్తి- కవిటి

విద్యలోనే కాకుండా ప్రతిభాపరంగా కూడా ముందంజలో ఉండే ఆర్‌కె పాఠశాల మరోసారి తన సత్తా చాటింది. కళింగపట్నంలో జరిగిన స్పెల్‌బి (పదోచ్ఛారణ) పోటీల్లో మండలంలోని ఆర్.బెలగాంలోని ఆర్‌కె పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం దక్కించుకున్నారు. మొత్తం 28 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. ఒకటో తరగతి విద్యార్థి బాకి తరుణ్, 4వ తరగతి విద్యార్థిని పంది దీక్ష తమ కేటగిరీల్లో ప్రథమ స్థానాలు సాధించి పాఠశాలకు చిరస్మరణీయ గౌరవం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి.గురుమూర్తి, సిబ్బంది విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న భాస్కరరావు

ఘనంగా ఆర్‌ఎంపిల ఆత్మీయ కలయిక

వజ్రపుకొత్తూరు: గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు ప్రథమ చికిత్స అందించడంలో ఆర్‌ఎంపి వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆర్‌ఎంపి వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.భాస్కరరావు అన్నారు. మండలంలోని పూండి వేదికగా ఆదివారం ఆర్‌ఎంపి వైద్యుల ఆత్మీయ కలియిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆర్‌ఎంపి వైసద్యులు వైద్యం దృష్టిసారించాలన్నారు. ఆర్‌ఎంపి వైద్యులు ఎదుర్కొంటున్న సమ్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. జిల్లా ఆర్‌ఎంపి వైద్యుల సంఘం ఉపాధ్యక్షుడు కూర్మారావు, కోశాధికారి టి.విజయ్‌కుమార్, మండలం అధ్యక్షుడు ఎం.సవరయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్.నీలకంఠం, కార్యదర్శి బి.మేఘనాథం, భాస్కరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు


ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బంటుపల్లిలో సర్పంచ్ నడుకుదిటి రజని ఆధ్వర్యంలో జెమ్స్ ఫౌండేషన్ వైద్యశిబిరాన్ని సచివాలయంలో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం మెరుగుపడేలా వైద్యులు సలహాలు పాటించి మందులు వాడాలన్నారు. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శివ సుబ్రహ్మణ్యం, యస్వంత్, బి.రాంప్రసాద్, మల్లేశ్వరరావు, వెంకటలక్ష్మి, ఆశవర్కర్లు టి.రామలక్ష్మి, ఎన్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో సమగ్రాభివృద్ధి

ఆమదాలవలస: నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర అభివృద్ధి సాధించడానికి అందరి సహకారం తీసుకుంటానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన కలిసిన పలువురు పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. విశ్రాంత మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీప్రసాద్, తహశీల్దార్ పేడాడ జనార్ధనరావుతో పాటు మరికొంతమంది ఎమ్మెల్యేను కలిసి కూటమి ప్రభుత్వ పాలనలో చేస్తున్న అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అందరూ సహకరిస్తే సిఎం చంద్రబాబు నాయుడు చొరవతో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించి ప్రజలకు అవగాహన కల్పించి తన దృష్టికి తీసుకువస్తే అటువంటి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అలాగే నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి వివిధ కంపెనీల ద్వారా జాబ్ మేళాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు.



విశ్రాంత ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

కూలడానికి సిద్ధంగా పాఠశాల భవనం

అద్దె భవనంలో ప్రభుత్వ బడి
ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 15వ వార్డు పాతినవారి వీధిలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాల కూలడానికి సిద్ధంగా ఉంది. సుమారు 30 సంవత్సరాల కిందట అప్పటి మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డేపల్లి సత్యవతి ఈ ప్రాంతంలో పాఠశాల ఏర్పాటు చేసి భవన నిర్మాణం చేపట్టడం జరిగింది. ప్రస్తుతం ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ఏ క్షణాన కూలిపోతుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేసి తమ పిల్లలను పాఠశాలకు పంపించడం మానేశారు. మరి కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. ఒకప్పుడు ఈ ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఉండగా ఇటీవల అది 35కు చేరుకోగా పాఠశాల భవన దుస్థితి దృష్ట్యా తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తూ పదిమంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు వెళ్లిపోవడంతో ప్రస్తుతం 25 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పాతినివారివీధి మున్సిపల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం దుస్థితి గతంలో పలుమార్లు తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులకు వివిధశాఖల అధికారులకు వినతలు ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో పాఠశాల భవనం పూర్తి శిథిలావస్థకు చేరుకొని విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న విషయాన్ని గ్రహించిన విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు సమీపంలో ఉన్న ఇంటిని రూ.5 వేలకు అద్దెకు తీసుకొని ప్రభుత్వ పాఠశాల నిర్వహిస్తున్న దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పాతినవారివీధి ప్రాథమిక పాఠశాల అద్దె భవనంలో నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ జిల్లా విద్యాశాఖ మున్సిపల్ అధికారుల పనితీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో నాడు నేడు పేరుతో లక్షల కోట్ల రూపాయలతో విద్యా వసతులకు విద్యాభివృద్ధికి ఖర్చు చేసినప్పటికీ వైసిపి పాలకులు, అప్పటి అధికారులు ఈ పాఠశాల వైపు కన్నెత్తి



అద్దె గదిలో విద్యార్థుల పాట్లు



శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల భవనం

చూడకుండా నిర్లక్ష్యం వహించి ఎటువంటి విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని పలువురు విమర్శిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామంటూ తల్లికి వందనం అమలు చేయడంతో పాటు మెగా పేరెంట్స్ డే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ పాతిన వారివీధి పాఠశాలపై దృష్టి పెట్టి తక్షణమే నూతన పాఠశాల భవన నిర్మాణం జరిపి ప్రభుత్వ విద్య మనుగడను కాపాడాలని 15వ వార్డుకు చెందిన ప్రజలు కోరుతున్నారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి సొంత డబ్బులు అద్దె చెల్లిస్తున్న ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగిస్తూ తాత్కాలికంగా ఇతర ప్రభుత్వ భవనంలో పాఠశాల నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలో వున్న కొండపేటలో శుక్రవారం రాత్రి వరికుప్పలు దగ్ధమయ్యాయి. కొండపేట గ్రామానికి చెందిన రైతు మజ్జి సూర్యనారాయణ, పాలక వరాలమ్మకు చెందిన వరికుప్పలను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. కష్టపడి పండించిన వరి పంట దగ్ధం కావడంతో రైతు కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. విషయం తెలుసుకున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం పెద్దపేట గ్రామంలో బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించారు. నష్టాన్ని అంచనా వేసి, అవసరమైన సహాయం అందించేలా అధికారులను ఆదేశించారు. రైతుల భద్రత కోసం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో జరిగిన ఈ ఘటనపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవల్లిక తెలిపారు. ఆయనతో పాటు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణనాయుడు, నీటిసంఘం అధ్యక్షులు కె.కృష్ణ, బిసిసెల్ అధ్యక్షులు మామిడి దుర్గారావు, వావిలిపిల్లి నారాయణరావు తదితరులున్నారు.

- **అభివృద్ధా?.. వినాశనమా?**
- **థర్మల్‌ప్లాంట్ వద్దన్నా ఎందుకు పెడుతున్నారు?**
- **సాహితీవేత్తల సూటి ప్రశ్న**

సాహిత్యంతోనే పోరాటం

ప్రజాశక్తి- అరసవల్లి

కార్గో ఎయిర్‌పోర్ట్, థర్మల్ పవర్‌ప్లాంట్ల స్థాపన ప్రజా వ్యతిరేకమైనదని సాహితీవేత్తలు స్వీయ కవితా పఠనం ద్వారా వారి మనోభావాలు వెల్లడించారు. సాహితీ స్రవంతి శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం యుటిఎఫ్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్గో ఎయిర్‌పోర్ట్, థర్మల్‌పవర్, విశాఖ ఉక్కు తదితర అంశాలపై కవులు స్పందిస్తూ పోరుబాటకై కవితా పఠనం శ్రీకాకుళం సాహితీ స్రవంతి అధ్యక్షులు కేతవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న కవులు 'కొండలు మాయం అంతా ఓడల నీడలంట ఆదానీల ఇంద్రజాల మంట, 'ఇ మానం అదిగో ఇమానం ఇసురుగాలితో సమానం భూములు మింగే తిమింగలం అంట, గారడి మాయాజాలం కూడు లేదురా గురువా అంటే భూమి లేకుండా చేస్తారంట 'సోంపేటలో కరెంటు మంటలు చల్లారక ముందే కాకరపల్లిలో షాకుల మచ్చలు మాయకముందే సరుబుజ్జిలో జన్‌కో దోపిడీ జనంమీద ప్రత్యక్ష రాపిడి అంటూ పదునైన కవితలను వినిపించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కవితా చైతన్య సాహిత్యంతో ఎక్కుపెట్టారు. ప్రజల తరపున నిలబడ్డారు. పోరాట స్ఫూర్తిని చాటారు. అభివృద్ధి అంటే ప్రజల జీవితాల్లో అభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదల అని వారు అన్నారు. ఈ సందర్భంగా కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ భూములను రైతుల నుంచి కాజేసి కార్పొరేట్లకు కట్టబెట్టడమే అభివృద్ధా? అని ప్రశ్నించారు. రైతులకు సాగునీరు పంటలకు గిట్టుబాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం ఇది ప్రజల కోరుకునే అభివృద్ధి అని ఆయన అన్నారు. వినాశకరమైన థర్మల్ ప్లాంట్లు అణు విద్యుత్ ప్లాంటు, కార్గో ఎయిర్‌పోర్ట్ కార్పొరేట్ల ప్రయోజనాలకే తప్ప ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలకు కాదన్నారు. అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే విశాఖ ఉక్కుఫ్యాక్టరీని పరిరక్షించాలని ఆయన కోరారు. సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాసరావు



పోరుబాట కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి చేస్తామంటున్న పాలకులు స్థానిక ప్రజలను ఎందుకు కలవ లేకపోతున్నారని ప్రశ్నించారు. అక్కడి ప్రజలు సమావేశం పెట్టుకోకుండా ఎందుకు నిర్బంధం విధిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలను అణచివేసి చేసేది అభివృద్ధి ఎలా అవుతుందన్నారు. సోంపేట కాకరపల్లిలో జరిగిన పోరాటాలు అక్కడ థర్మల్‌ప్లాంట్‌లు పెట్టకుండా తోకముడిచిన తీరు ప్రభుత్వాన్ని గుర్తు లేదా అని అన్నారు. కార్యక్రమంలో కవులు శ్యామలరావు, దాసు బాబు, మాలతి, రమణారావు, వైకుంఠరావు, దివాకర్, ఎర్రమ్మ, ప్రభాకర్, భారతి తదితరులు పాల్గొన్నారు.



రమణారావును సత్కరిస్తున్న ఎంపిటిసి దంపతులు

నాగవంశం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో అన్ని రంగాల్లో నాగవంశం ప్రజలు అభివృద్ధి చెందేలా తనవంతు కృషి చేయనున్నట్లు నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఎరుబోతు రమణారావు అన్నారు. పట్టణం విచ్చేసిన ఆయనను ఆదివారం టిడిపి పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి శ్రీరంగ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపిటిసి-2 అనకాపల్లి వాణి, శ్రీరంగనాయకులు దంపతులు పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. వీరితో పాటు టిడిపి నాయకులు ఎంఎస్‌ఎన్, అనకాపల్లి శ్రీనివాస్, తదితరులున్నారు.

కళావేదిక నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- అరసవల్లి

రథసప్తమి వేడుకల సందర్భంగా సాంస్కృతిక కళావేదిక నిర్మాణానికి ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వీటి నిర్మాణాల కోసం రూ.20.5 లక్షల నిధులు కేటాయించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులతో అరసవల్లి కోనేరు చెరువు స్థలంలో నిర్మాణం, అరసవల్లి ఇంద్ర పుష్కరిణి వెనుక రాణి గెడ్డ ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా అరసవల్లి అసిరితల్లి పండుగలకు, రథసప్తమి వేడుకలకు అభివృద్ధి పనులపై దృష్టి సారించామన్నారు. అరసవల్లి, కల్లేపల్లి రోడ్డు విస్తరణ పనులు కూడా జరుగుతున్నాయన్నారు. అరసవల్లిలో వివిధ కాలువలు, రోడ్లు నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



దుప్పట్లను పంపిణీ చేస్తున్న బాబూరావు

దుప్పట్లు పంపిణీ

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డు పరిధిలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఇన్‌ఛార్జి కొరికాన శంకరరావు పేదలకు తన సొంత ఖర్చుతో ఆదివారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. చలికాలంలో పేదలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు సుమారు 300 మందికి పైగా దుప్పట్లు పంచిపెట్టిన కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేసినందుకు సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రశాంత్, కిషోర్ పాల్గొన్నారు.

టెక్కలిని కొత్త జిల్లాగా ప్రకటించాలి

టెక్కలి రూరల్: టెక్కలిని కొత్త జిల్లాగా ప్రకటించాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.గురునాధయాదవ్ డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నవ్య ఆంధ్రప్రదేశ్ 13 జిల్లాలతో మిగిలిపోయిందన్నారు. ఆ తర్వాత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి 26 జిల్లాలుగా ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే కొన్ని కొత్త డివిజన్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇటీవల మూడు జిల్లాలను ఏర్పాటు చేసిందన్నారు. అందుకు టెక్కలి కొత్త జిల్లాగా ఏర్పాటు చేయడానికి అనేక అర్హతలు ఉన్నాయని తెలిపారు. జిల్లాకు సరిపడే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు, స్థలాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం గుర్తించి టెక్కలి కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న కిరణ్ కుమార్

ర్యాలీ విజయవంతం చేయాలి

రణస్థలం: మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ర్యాలీని విజయవంతం చేయాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధినేత వైస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణను నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఎచ్చెర్ల నియోజకవర్గంలో పూర్తయిందన్నారు. సంతకాల సేకరణ పత్రాలు జిల్లా పార్టీ అధ్యక్షులు కార్యాలయానికి ఈ నెల 10న ర్యాలీగా వెళ్లి అందజేయనున్నామన్నారు. ఈ ర్యాలీకి వైసిపి నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, నాలుగు మండలాల వైసిపి అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌ఐ బాలరాజుకు ఫిర్యాదు చేస్తున్న రవికుమార్

తప్పుడు ప్రచారం మానుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

తన డిగ్రీలపై ఎమ్మెల్యే కూన రవికుమార్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను మానుకోవాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే రవికుమార్‌పై చింతాడ రవికుమార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రవికుమార్ దయాదాక్షిణ్యాల మీద ఆయన సిఫార్స్‌తో తనకు డిగ్రీల సర్టిఫికెట్లు వచ్చాయని, తన చెప్పుతో సమానమని, వైసిపి క్యాడర్ బట్ట కట్టేవారు కాదని, తిండి తినేవారు కాదని, సభ్య సమాజం సిగ్గుపడేలా ఆగస్టు 18న మీడియా ముఖంగా మాట్లాడారని, ఇది ఆయనకు తగదన్నారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి అలా మాట్లాడటం సరికాదని, క్యాడర్ మధ్య ఉద్వేగాలు రెచ్చగొట్టే విధంగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఆయన వ్యాఖ్యలను దృష్టిలో పెట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ బాలరాజుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఒక సామాన్యమైన చదువుకున్న వ్యక్తి రాజకీయాల్లోకి రాకూడదా అని ప్రశ్నించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే ఇలా మాట్లాడడం సభ్యసమాజానికి ఎటువంటి సందేశాన్ని ఇస్తున్నారని ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంలో ఉన్న తాము ప్రజల తరపున అధికార పక్షం తప్పులను ఎత్తి చూపడంతో తమపై ఎదురు దాడి చేస్తున్నారన్నారు. ఇటువంటి వ్యాఖ్యలకు, బెదిరింపులకు, తప్పుడు వ్యాఖ్యలకు, అధికార పక్షం పెడుతున్న కేసులకు తాము భయపడేది లేదన్నారు. ప్రజల తరపున తాము అధికారపక్ష లోటు పాట్లును ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తామన్నారు. టిడిపి చేస్తున్న అరాచక అక్రమాలను ప్రజల ముందు బహిర్గతం చేసి ప్రజా కోర్టులో దోషిగా నిలబెడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, బూర్జ వైసిపి మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, మాజీ కౌన్సిలర్లు అజంతా కుమారి, దుంపల శ్యామ్, అత్తులూరి శ్రీకాంత్, పొడుగు శ్రీను, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించారు. మండలంలోని సుమారు 750 మందికిపైగా విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన 40 మంది విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎన్.శ్యామ సుందర రావు, బి.ధనుంజయరావు తెలిపారు. ఈ మోడల్ పరీక్షకు పూర్వపు డిప్యూటీ డిఇఒ ఐ.వెంకటరావు, హైస్కూల్ హెచ్‌ఎం సిహెచ్ లక్ష్మీనారాయణ, మనోజ్ కుమార్ మహాపాత్రో, కె.శివకుమార్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తప్పని అవస్థలు

నవోదయ మోడల్ పరీక్షకు హాజరైన విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హైస్కూల్, జూనియర్ కళాశాలలో నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు వందల్లో విద్యార్థులు హాజరయ్యారు. అయితే విద్యార్థులు ఎండలో ఆరుబయట నేలపైనే కూర్చొని పరీక్షలు రాశారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొన్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కనీస సదుపాయాలు కూడా ఏర్పాటు చేయకుండా పరీక్షలు నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులను ఆరుబయట ఎండలో కూర్చోవడం వల్ల ఇబ్బందులకు గురయ్యారని తల్లిదండ్రులు వాపోయారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



తనిఖీ చేస్తున్న సిఐ రమణ

దాబాల్లో మద్యం అనుమతిస్తే చర్యలు

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట సర్కిల్ పరిధిలోని దాబాల్లో మద్యం తాగేందుకు అనుమతిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ రమణ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం పలు దాబాల్లో తనిఖీలు చేపట్టి, మద్యం తాగేందుకు అనుమతి ఇవ్వరాదని సూచించారు. మద్యం అనుమతి లేదనే బోర్డులు తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. సోంపేట, కొర్లాంలో తనిఖీలు నిర్వహించి, కొర్లాంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న పుణ్యవతి నుంచి 7 మద్యం సీసాలు తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇంతవరకు బెల్ట్ షాప్‌లు నిర్వహించిన వారిపై 45 కేసులు నమోదు చేసి సుమారు 83 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. గతంలో అనధికార మద్యం దుకాణాలను నడిపిన వారిని, అనుమానితులను స్థానిక తహశీల్దార్ అప్పలస్వామి ఎదుట బైండోవర్ చేశామన్నారు. సోంపేట సర్కిల్‌లోని సోంపేట, కంచిలి, మందస మండలాల తహశీల్దార్ల ఎదుట 63 మందిని బైండోవర్ చేయించామన్నారు. ఆనధికార మద్యం దుకాణాలపై సమాచారం ఉంటే 14405 నంబర్‌కు ఫోన్ చేసి సహకరించాలని కోరారు.

విద్యార్థి ప్రతిభ



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మధులత

టెక్కలి : స్థానిక ఓక్లాండ్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి సుహాన్ నారాయణ్ అబాకస్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ మళ్లా మధులత ఆదివారం అభినందనలు తెలిపారు. జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో పాల్గొన్న సుహాస్ నారాయణ్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

'జెమ్స్'లో సిఎంఇపై సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ శంకరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ఆపదలో ఉన్న రోగికి సంరక్షణలో మేలైన విధానాలను పాటించాలని అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ బివిజి శంకరరావు అనస్థీషియా వైద్యులకు సూచించారు. మండలంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో జోనల్ సిఎంఇ (నిరంతర వైద్య విద్యా సదస్సు)ను ఆదివారం అనస్థీషియా విభాగాధిపతి శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జోన్‌లో ఉన్న ఎనిమిది ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల నుంచి 200 మంది అనస్థీషియా పీజీ విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు. అనస్థీషియా రంగంలో కృత్రిమ మేధ పాత్ర, ఆధునిక పరిణామాలు, రోగి సంరక్షణలో మేలైన విధానాలు తదితర అంశాలపై బోధన, చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో జెట్ స్పీడుతో అందివస్తున్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రోగులకు సేవ చేయాలని విద్యార్థులను కోరారు. ఎన్‌టిఆర్ విశ్వ విద్యాలయం తరపున పర్యవేక్షకునిగా వ్యవహరించిన డా. మురళీ కృష్ణ మాట్లాడుతూ కార్యక్రమం విజ్ఞానదాయకంగా, విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెమ్స్ కళాశాల వివిధ విభాగాల డైరెక్టర్లు డా.సుధీర్, శ్రీధర్ రెడ్డి, డా. రామారావు, అనస్థీషియా హెడ్ డా.సుబ్బలక్ష్మి, జెమ్స్ అనస్థీషియా వైద్యులు డా.ప్రదీప్, డా.అశోక్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కవులు సమాజ నిర్దేశకులు కావాలి

అరసవల్లి: నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక 111వ నెల సాహితీ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాంతినికేతన్ కళాశాల డైరెక్టర్ సురంగి మోహనరావు మాట్లాడుతూ కవులు సమాజహిత రచనల ద్వారా ప్రజా చైతన్యం తీసుకు రావాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న పూర్వపు జిల్లా విద్యాశా ఖాధికారి బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ సమాజ మార్గదర్శకునిగా కవిపాత్ర చాలాకీలక మైనదని, తెరవేలో రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన కవులు ఉండటం అభినంద నీయమన్నారు. సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ప్రధాన కార్యదర్శి రఘుపాత్రుని వెంకట రమణమూర్తి వివరించారు. ఇటీవల జరిగిన సిక్కోలు పుస్తక మహోత్సవంలో పాల్గొన్న తెరవే కవులకు జ్ఞాపికలు అందజేశారు. సభ్యులు కిల్లాన శ్రీనివాస్, చిన్నయ సూరి సాహితీ పీఠం రాష్ట్ర కార్యదర్శి తుళ్లూరు విజయ లక్ష్మణ్, ముట్నూరు ఉపేంద్రశర్మ, గుడిమెట్ల గోపాల కృష్ణ, తులాల సవరమ్మ, బారువ కోమలరావు, ఇద్ది పాపయ్య, వావిలపల్లి రాజారావు పాల్గొన్నారు.



కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు



అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇళ్లు

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- రణస్థలం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు తాటాకు ఇళ్లు అగ్నికి ఆహుతైన ఘటన ఆదివారం మండలంలోని జీరుపాలెం గ్రామంలో జరిగింది. జీరుపాలేంలో మైలపల్లి కోర్లమ్మ, చిలకమ్మ పక్కపక్క ఇళ్లల్లో నివాసముంటున్నారు. విద్యుత్ వైర్లు నుంచి మంటలు వ్యాపించి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అగ్నికి ఆహుతయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. మంటలు రెండిళ్లకు వ్యాపించడంతో నిమిషాల వ్యవధిలోనే ఇంట్లోని వస్తువులు, రెండు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. గృహోపకరణాలు, దుస్తులు, రూ.30 వేల నగదు, ఇతర పత్రాలు మంటల్లో కాలిపోయాయని బాధితులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులతో పాటు స్థానికులు కోరుతున్నారు. విషయం తెలిసిన వెంటనే రణస్థలం అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలు అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందంతో స్థానికులు ఊపిరి పిల్చుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

జీరుపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిళు కాలిపోయిన విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ జీరుపాలేంలో బాధితులను పరామర్శించి నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందించాలని, వారికి పక్కా గృహాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు.

కాశీబుగ్గ సిఐగా రామకృష్ణ

ప్రజాశక్తి- పలాస



రామకృష్ణ, సిఐ

కాశీబుగ్గ సిఐగా వై.రామకృష్ణ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన పి.సూర్య నారాయణను జిల్లా కేంద్రానికి రిపోర్ట్ చేశారు. విజయనగరం జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ నుంచి రామకృష్ణ బదిలీపై కాశీబుగ్గ సిఐగా వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో పని చేసిన అనుభవం ఉందని అన్నారు. శాంతిభద్రతలను కాపాడతానని చెప్పారు. ఈ ప్రాంతంలో మరలా పనిచేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. అందరి సహకారంతో శాంతి భద్రతలను కాపాడతానని తెలిపారు.



చేనేత కార్మికులకు అందజేస్తున్న నిత్యావసర సరుకులు

చేనేత కార్మికులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తోలాపిలో మొంథా తుపాను కారణంగా నష్టపోయిన చేనేత కార్మికులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్మికులకు 50 కేజీల బియ్యం, కేజీ చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు వంటి పలు నిత్యావసర సరుకులను అందజేశారు. మొదటి విడతగా 28 మందికి, రెండో విడత 15 మందికి కలిపి మొత్తం 43 మంది చేనేత కుటుంబాలకు సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పి.రామారావు, పి.అప్పల నాయుడు, గంగాధరరావు, సత్యం, రమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే జన్మదినం

నరసన్నపేట: స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత కార్యాలయంలో కీర్తిశేషులు ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన టిడిపి నాయకులు కేక్ కట్ చేసి నాయకులతో కలిసి కేక్ కట్ చేసి అభిమానులతో పంచిపెట్టారు. అనంతరం నరసన్నపేట సామాజిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఛైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ ఛైర్మన్లు, డైరెక్టర్లు, పిఎసిఎస్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రేవతీపతి సేవలు చిరస్మరణీయం

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కీర్తిశేసులు కొర్ల రేవతీపతి సేవలు చిరస్మరణీయమని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం రేవతీపతి 67వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, టెక్కలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిపి నడుపూరి శ్రీరామ్మూర్తి, వైసిపి నాయకులు సత్తారు సత్యం, అన్నెపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

'మందపల్లి'కి వనమిత్ర పురస్కారం

ప్రజాశక్తి- ఆమదాలవలస



రామకృష్ణారావును సన్మానిస్తున్న సైనిక అధికారులు

పాఠశాలలు, దేవాలయాల పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించిన సరుబుజ్జిలి మండలానికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు మందపల్లి రామకృష్ణారావును మాజీ సైనిక అధికారులు వనమిత్ర పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఆదివారం పట్టణంలో ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో నిర్వహించిన 38 అస్సాల్ ఇంజినీరింగ్ రెజిమెంట్ 54 అవతరణ దినోత్సవం వేడుకలో మందపల్లిని అభినందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుబేదార్ మేజర్ సంపదరావు కృష్ణారావు రామకృష్ణారావును దుశ్శాలువ, జ్ఞాపిక, పండ్ల మొక్కను బహూకరించి సత్కరించారు. ఆంధ్ర, తెలంగాణకు చెందిన సైనికులు మాజీ సైనికుల కుటుంబ సభ్యులతో పాల్గొని 54 అవతరణ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కూచిపూడి అభినేత్రి కూన శ్రీలత ఆధ్వర్యంలో ఆమె బృందం నాట్య ప్రదర్శనలు, గేదెలవానిపేటకు చెందిన సాధు భార్గవి ఆధ్వర్యంలో కౌసల్యారామ కోలాట బృందంతో నిర్వహించిన కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుబేదార్ మేజర్ పప్పల గోవిందరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ సైనిక అధికారులు సుబేదార్ మేజర్ పైడి గోవిందరావు, నారా జనార్దనరావు, పి.నాగేశ్వరరావు, బిఎస్ఎస్ రావు, కెప్టెన్ రాజారావు తదితరులతో పాటు విశాఖపట్నం రీజియన్‌కు చెందిన సైనిక అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో భాగంగా ఉమ్మడి జిల్లాస్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో కవిటి మండలం మరోసారి ప్రతిభను చాటుకుంది. రణస్థలం మండలం జె.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కీర్తిశేషులు బాలి వెంకటరమణ జ్ఞాపకార్థం పదో తరగతి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రియా మురహరి జిల్లాలో 7వ ర్యాంకు సాధించి పాఠశాలకు గౌరవం తెచ్చిపెట్టాడు. ఈ విజయంతో మురహరికి రూ.4 వేలు నగదు, పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు చిత్రి ఈశ్వరరావు, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధి రెయ్యి లోకనాథం, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, కృష్ణ, అప్పలరాజు, సింహాచలం, నాగమణి, సంతోషి కుమారి, యోహాన్, దేవరాజు, మొర్రి గోపి మురహరిని అభినందించారు.

బాల్య వివాహాలపై అవగాహన

ఇచ్ఛాపురం : బాల్య వివాహాల నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గోడలపై చిత్రాలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట అధికారి రాజేశ్వరి ఆధ్వర్యాన రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతంలో గోడలపై బాల్య వివాహాలకు వ్యతిరేకంగా శనివారం ప్రచారం చేపట్టారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

రూ.43 వేలు ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : మండలంలో బూర్జపాడులో సూరు సన్యాసి కుమార్తె జోగమ్మ కిడ్నీ సమస్యతో బాధపడుతుంది. ఆమె కుటుంబం మందుల ఖర్చులు కూడా భరించలేకపోతుంది. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ యువజన సంఘం సభ్యులు రూ.43 వేలు ఆర్థికసాయం శనివారం అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాధాకృష్ణ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన భోజనాలు

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట టౌన్ చౌడేశ్వరిదేవి దేవాంగుల వన భోజనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, పెద్దలు ఉప్ల గాంధీ, ఉప్ల మీన కేతనరావు, ఉప్ల సోమేశ్వరరావు, డాక్టర్ ఎర్ర రాజేష్, డాక్టర్ ఎర్ర అనూష, డాక్టర్ మంచు ప్రదీప్, కొల్ల తారకేశ్వరరావు, ముప్పన ఈశ్వరరావు, సోంపేట దేవాంగుల ఐ సంఘం సభ్యులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని అపురం జాతీయ రహదారి నుంచి ఘాటి ముకుందపురం వరకు చేపడుతున్న రోడ్డు మరమ్మతు పనులను టిడిపి నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి యువజన నాయకుడు మాదిన ప్రదీప్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రహదారి పాడై పరిసర గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో పరిస్థితిని స్థానిక ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వాసాల రమేష్‌రెడ్డి, నాయకులు కిషోర్, శ్రీరాములు, మణి, వంశి పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయ శిబిరం ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాలుగున్నారని కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. జాతీయ పథకం సేవా కార్యక్రమాల నెల 1 నుంచి వివిధ కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయన్నారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రూప్‌సుందర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కేశవరావు, రమణ, వాలంటీర్లు చరణ్, చాందిని, సుస్మిత, తులసి పాల్గొన్నారు.



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కూర్మారావు

సాయి ఉషోదయ విద్యార్థుల ప్రతిభ

నందిగాం: వేద ఇంటర్నేషనల్ ఎ-వన్ అకడమీ ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి సల్‌బి పోటీల్లో మండలంలోని లట్టిగాంలోని సాయి ఉషోదయ స్కూల్ విద్యార్థులు ప్రతిభకనబరిచి ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ సింగుపురం కూర్మారావు అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

సమాజ సేవలో పాల్గొనాలి

సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

ప్రజాశక్తి- బూర్జ

ఆపదలో ఉన్నవారికి, సేవ చేయడమే మహాభాగ్యమని శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో శ్రీ సత్యసాయి సేవా సమితిని ప్రారంభించారు. సత్యసాయి బాబా ఎన్నో సేవలను చేసి చూపించారని, ప్రతి ఒక్కరూ పొరుగు వారికి సేవలు అందజేయడం అదృష్టంగా భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాల్గొనాలన్నారు. అంతకు ముందు బూర్జలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షులు కె.రామచంద్రరావు, ఎంపిపి కె.దీప, పూర్వ ఎంపిడిఒ రవీంద్రబాబు, ఎన్ఆర్‌వి వేపారి వెంకటేష్, ఎంపిటిసి పోలినాయుడు, చొక్కా కృష్ణకాంత్, సత్యసాయి సంస్థల కన్వీనర్లు, ప్రజలు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డులు

ప్రజాశక్తి- అరసవల్లి

చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ విద్యార్థులకు అవార్డ్స్ రావడం ఎంతో ఆనందదాయకమని జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ పాటవాలు చూపించడం అభినంద నీయమని రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎల్.నందకేశ్వరరావు ఆధ్వర్యంలో అవార్డు పొందిన విద్యార్థులతో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు నుంచి చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు, వ్యాసరచన, పాటల పోటీలు, నృత్యాలు నిర్వహిస్తూ కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ పోటీల్లో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్‌లో ఉన్న 24మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్, 16 సిల్వర్ మెడల్, 12 కాంస్య మెడల్స్, సర్టిఫికెట్లు, ఆట బొమ్మలు రంగోత్సవ సంస్థ ఆధ్వర్యంలో ఇచ్చారని తెలిపారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ అధికారి నారాయణరావు, విశ్రాంత సిఇఒ సురంగి మోహనరావు, బిఎంఎస్ఎస్ పట్నాయక్, నందికేశ్వరరావు, డ్రాయింగ్ టీచర్ దీప్తి, సాయిప్రసాద్, ఎస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మంత్రి అభినందనలు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ఎన్‌టిఆర్ క్రీడావికాస్ కేంద్రానికి చెందిన పలువురు ఇటీవల నిర్వహించిన వివిధ రకాల క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వీరికి మంత్రి క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారని నర్సిపురం శేఖర్ ఆదివారం తెలిపారు. క్రీడా కోటాలో మెడిసిన్ సీటు సంపాదించిన బందపల్లి జాశ్విక, పడాల అభిషేక్, మెండ తపస్వి, అట్టాడ మహీధర్‌లను అభినందించినట్టు పేర్కొన్నారు. నియోజకవర్గ పేరును రాష్ట్రంలో గుర్తింపు తీసుకురావడంపై క్రీడాకారులతో పాటు, కోచ్ శేఖర్‌నూ మంత్రి అభినందించారు.



జాశ్వికను అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు